క్లుప్తంగా

రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు


ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మాచుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. సోమవారం సిద్దవటంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతినగర్ పాఠశాల నాడు–నేడు మొదటి విడతలో ఎంపికయిందన్నారు. ఇక్కడ నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. పాఠశాల కొనసాగుతుండగానే కొద్ది రోజులకు వెనుక వైపు ప్రహరీ కూలిపోవడంతో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విషపురుగులు ఆవరణలో సంచరిస్తున్నాయని తమ దృష్టికి తెచ్చారన్నారు. తాను మొదటిలో ఈ పాఠశాలను సందర్శించినప్పుడు ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు కనిపించాయని తెలిపారు. రక్షణ గోడ సమస్య పరిష్కారం కోసం సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని, ఉన్నతాధికారులకు తెలుపుతామని పేర్కొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

చిట్వేలి : గణేష్ హోటల్ యాజాన్యం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో సోమవారం పేద ప్రజలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్వేలి మానవతా సేవాసంస్థ అధ్యక్షులు కుంభగిరి మునిరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వనాథరెడ్డి సేవలు ఆదర్శనీయం

వీరబల్లి : మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి సేవలు ఆదర్శనీయమని నాయకులు తెలిపారు. వీరబల్లిలో సోమవారం పూర్వ లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే దివంగత గాలివీటి విశ్వనాథరెడ్డి జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ వీరబల్లి మండలాధ్యక్షులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ప్రస్తుత మండలాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, గాలివీటి మురళీరెడ్డి, గాలివీటి విజయసాగర్‌రెడ్డి, వీరబల్లి, సుండుపల్లె, రాజంపేట మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి


కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పిస్తున్న మేనేజర్

ఓబులవారిపల్లె : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని చిన్నఓరంపాడు బ్రాంచ్ మేనేజర్ రునేంద్ర పేర్కొన్నారు. సోమవారం చిన్నఓరంపాడు, జ్ఞానంపల్లి కాలనీలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, బంగారుపై తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ద్వారా బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆర్ముగం, సీసీ దామోదర్, కళాజాత బృందం చిరంజీవి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

భూ కబ్జాలను అరికట్టాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న లింగిరెడ్డిపల్లె గ్రామస్తులు

ఓబులవారిపల్లె : భూ కబ్జాలను అరికట్టాలని లింగిరెడ్డి పల్లె గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు వారు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ పిర్ మున్నీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ లింగిరెడ్డిపల్లె గ్రామం శ్మశాన వాటిక, పెద్దఓరంపాడు దేవుడి మాన్యం, ప్రభుత్వ భూమిలో దాదాపు వంద ఎకరాలను స్థానిక నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి, ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పోలి పాపిరెడ్డి, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, శివారెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

మదనపల్లె సిటీ: శివరాత్రి పండుగ పురస్కరించుకుని మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోలు శైవక్షేత్రాలను ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. దీంతో ఆర్టీసీని ఆదాయం పెరిగినట్లు డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ, అంగళ్లు మల్లయ్యకొండలకు ప్రత్యే క బస్సు సర్వీసులు నడపడం వల్ల ఈపీకె 91.75, ఓఆర్ 171 వచ్చి జిల్లాలో మొదటి స్థానం నిలిచినట్లు తెలిపారు. టు డిపో నుంచి మదనపల్లె నుంచి ఝరికి రూ.3,71,401, తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయంకు రూ.2,54,962 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సిబ్బంది కృషితో ఆదాయం పెరిగినట్లు తెలిపారు.

ఈశ్వరా.. త్రేతేశ్వరా..

- వైభవంగా రథోత్సవం
- జనసంద్రమైన అత్తిరాల


ప్రత్యేక అలంకరణలో కామాక్షీదేవి సమేత త్రేతేశ్వరస్వామి


అత్తిరాలలో బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

రాజంపేట టౌన్ : 'ఈశ్వరా.. పరమేశ్వరా.. త్రేతేశ్వరా' అంటూ భక్తులు ప్రణమిల్లారు. ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాల (అత్తిరాల)లో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన సోమవారం త్రేతేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకట సుబ్బారెడ్డి, ఈఓ గంగవరం కొండారెడ్డి ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత కామాక్షీదేవి సమేత త్రేతేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం కొండపైన ఉన్న ఆలయం నుంచి కిందవున్న రథం వరకు ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ తీసుకొచ్చారు. రథంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చే ముందు ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభశాస్త్రి నేతృత్వంలో పురోహితులు దాదాపు గంట పాటు విశేష పూజలు నిర్వహించారు. ఇదే సమయంలో రథానికి మేకను ఆహుతిచ్చి కుంభం కూడుతో శాంతిపూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులు రథంపై కొలువుదీరారు. ఇక రథం ముందుకు కదిలే సమయంలో శివనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అనేక మంది భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. దాదాపు ఒకటిన్నర కిలో మీటరు దూరంలో ఉన్న తేరుతిరుగుమాను వద్దకు రథం చేరుకోవడానికి రెండున్నర గంటలకుపైగా సమయం పట్టింది.

భారీగా బందోబస్తు

త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన ఘట్టాల్లో రథోత్సవం ఒకటి. అందువల్ల భారీ సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. అత్తిరాల జనసంద్రంగా మారింది. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

అత్తిరాలలో సోమవారం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. ఈ పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ పోటీలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డితో కలిసి ప్రారంభించారు. నందలూరుకు చెందిన షేక్ హబీబుల్లా ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎద్ల యజమానికి వైఎస్సార్ సీపీ యూత్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తంబెళ్ళ వేణుగోపాల్‌రెడ్డి ప్రదానం చేసిన రూ.50 వేల నగదును రూరల్ ఎస్ఐ భక్తవత్సలం చేతుల మీదుగా అందజేశారు. వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్‌యాదవ్ ఎద్లు ద్వితీయ స్థానంలో నిలవగా.. వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డిగారి రెడ్డయ్యరెడ్డి రూ.40 వేలను ప్రదానం చేశారు. కాశినాయన మండలం ఆనవారిపల్లె గ్రామానికి చెందిన సీలం జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన ఎద్లు తృతీయ స్థానం సాధించాయి. ఈ ఎద్ల యజమానికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆకేపాటి హరినాథ్‌రెడ్డి రూ.30 వేలు నగదు బహుమతిని అందజేశారు. కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన వర్దిపోగు స్వరూప్‌రాజుకు చెందిన ఎద్లు నాల్గవ స్థానం సాధించగా, నాగోలు చిన్నసుబ్బారెడ్డి రూ.20 వేలు ప్రదానం చేశారు. రాజంపేట మండలం తాళ్ళపాకకు చెందిన రెడ్డిచెర్ల శేషంరాజు ఎద్లు ఐదవ స్థానంగాలో నిలవగా.. వెలగచెర్ల గంగిరెడ్డి ఆధ్వర్యంలో రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు.

అర్జీదారుల ఆకలి తీరుస్తుండటం అభినందనీయం

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : గ్రీవెన్స్‌సెల్ అర్జీదారులు, పేదల ఆకలిని తీరుస్తుండటం అభినందనీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్ వద్దగల అన్నదాన కేంద్రంలో సోమవారం వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్ ఆర్థిక సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లా నలు మూలల నుంచి విచ్చేస్తుంటారన్నారు. వారి కోసం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం 10వ వారం కూడా కొనసాగడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు గాలివీడు యధుభూషణ్‌రెడ్డి, పల్లవు రమేష్, సుగవాసి ఈశ్వర్, అన్నా సలీం, రమేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, గంగిరెడ్డి, జావీద్, అమీర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

చాగలగుట్టపల్లె గంగమ్మకు ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామం చాగలగుట్టపల్లెలోని గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతర సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారి జాగారంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, లాలుతో కలిసి పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. పల్లకీని చేయించిన గురవయ్యగారిపల్లెకు చెందిన సుధాకర్ ఆచారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంటు పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిద్దక రామచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, లక్కిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబాబత్తిన రమేష్, వెంకటేష్, గురుమార్తి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె (వీరబల్లి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి అన్నారు. సుండుపల్లె మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు చేయడానికి ప్రభుత్వం సదుపాయం కల్పించిందని తెలిపారు. వేసవికాలం రాబోతుందని, కావున జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.9 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయాలలోని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ పనులు చేసి పెట్టాలని సూచించారు. ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకూడదని, సిమెంట్ రోడ్లు, తదితర సౌకర్యాలు లేవన్న మాట రాకూడదని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి

ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రతి పథకాన్ని ప్రజల వద్దకు చేర్చేందుకు వలంటీర్లు, గృహసారథులు నడుం బిగించి పని చేయాలని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి అన్నారు. సుండుపల్లె మండలంలో సోమవారం ఏర్పాటు చేసిన 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లు ప్రజలలో తిరుగుతూ తమకు కేటాయించిన 25 ఇళ్ల వద్దకు వెళ్లి గత ప్రభుత్వాలు చేసిన కార్యక్రమాలు, మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గృహసారథుల కిట్టును కొత్తగా నియమితులైన మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్ రెహమాన్‌ఖాన్‌కు ఎమ్మెల్యే, రాజంపేట నియోజకవర్గ పరిశీలకులు కృష్ణమూర్తి చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దయ్యస్వామి జాతర


దేవరెద్దు వద్ద భక్తులు, యువకులు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం ఇలవేల్పు దేవుడైన శ్రీ మాలే పెద్దయ్యస్వామి జాతర సోమవారం ముగిసింది. తెల్లవారుజామున చింతోళ్లమాలి నుంచి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతిలో దేవరెద్దు బయలుదేరింది. ఇంటింటి పూజలు అందుకుంటూ భక్తులు చెల్లించే మొక్కులను స్వీకరించింది. కురవపల్లె మీదుగా దేవగుడిపల్లెలోని దేవర ఇంటికి చేరుకొని అక్కడ పూజల అనంతరం దేవగుడిపల్లె, బాపూజీనగర్ కాలనీ మీదుగా జల్లావాండ్లపల్లెకు చేరుకుంది. దేవరెద్దు వెంట భక్తులు ఎద్దు పూజారి శ్రీనివాసులరెడ్డి ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం చింతోళ్లమాలిలో జరిగిన గంగదొడ్డి కార్యక్రమానికి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

మానవతా విలువలు పెంచుకోవాలి


మాట్లాడుతున్న కుమారస్వామి

సంబేపల్లె : విద్యార్థులు దేశభక్తి, మతృభక్తి, మానవతా విలువలు పెంచుకోవాలని వాత్సల్య భారతి సంస్థ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ×విద్యార్థులు– దేశభక్తి, మాతృభక్తి₹ అనే అంశంపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజంపట్ల బాధ్యతగా వుండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయానికి విరాళం

రాయచోటి అర్బన్ : సంబేపల్లె మండలంలోని నల్లగంగమ్మ ఆలయానికి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు సోమవారం రూ.9,700ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, రెడ్డికీర్తి, అధ్యక్షుడు షేక్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, సభ్యులు ప్రసాద్‌నాయుడు, అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ రాజగోపాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో జగనన్న గోరుముద్ద విద్యార్థులకు అందించాలని సూచించారు. మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ విద్యాసహాయకులు జావిద్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిట్స్ ప్రొఫెసర్‌కు యువ రచయిత అవార్డు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ కుంట ముక్కల మంజు ప్రీతం 'తనేగా ప్రాణం' పుస్తకం రాసినందుకు మదనపల్లె ప్రజా చైతన్య స్రవంతి వారు యువ రచయిత అవార్డు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల సోమవారం అభినందించారు. రచయిత మంజు ప్రీతం మాట్లాడుతూ పుస్తకంలో 55 కవితలు రాసినట్లు తెలిపారు.

ఎర్రబల్లె ఆసుపత్రికి పెళ్లి రోజు కానుక

కురబలకోట: సాధారణంగా మొదటి పెళ్లి రోజును ఘనంగా జరుపుకోవాలని ఆశించడం సహజం. మండలంలోని ఎర్రబల్లె సచివాలయ పరిధిలోని కంటేవారిపల్లెకు చెందిన సుకన్య, అమర్‌నాథ్ దంపతులు వినూత్నంగా ఆలోచించారు. ఎర్రబల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యం కోసం సోమవారం మంచం, పరుపు విరాళంగా అందజేశారు. వీరిని గ్రామస్థులు, ఆరోగ్య సిబ్బంది అభినందించారు.

వృద్ధుడిపై దాడి.. కేసు నమోదు

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట పంచాయతీ యర్రమాసివారిపల్లెకు చెందిన వై.శంకర్‌నాయుడు (58)ను అదే గ్రామానికి చెందిన సమీప బంధువు వై. శ్రీనివాసులు ఆర్థిక వ్యవహారాల కారణంగా ఆదివారం రాత్రి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి భార్య వై. ధనమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కలకడ మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ చెరువుకింద పల్లెకు చెందిన పూజారి రామనాథ్(45) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కలకడ ఝరికోనలో జరుగుతున్న శ్రీ సిద్దేశ్వర స్వామి తిరునాలకు ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామనాథ్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా దుర్గా హోమం

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి


భద్రకాళీ అమ్మవారు


చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆరో రోజైన సోమవారం ఆలయ ఆవరణలో దుర్గా హోమం (చండీ హోమం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు కిరీటధారణలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి శేషవాహనంపై ఊరేగారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో నందుల మఠం సిద్ధాంతి శశిభూషణ్ ఆచార్యత్వంలో రుత్వికులు, శిష్యబృందం కలిసి హోమం నిర్వహించారు. పూర్ణాహుతి సమర్పించారు. లోకకల్యాణార్థం కోసం హోమం నిర్వహించినట్లు వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి స్నేహశ్రీ, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలక పాలక మండలి సభ్యులు, పురప్రముఖులు, అధికారులు తదితరులు పాల్గన్నారు.

వెన్నపూసను అధిక మెజార్టీతో గెలిపించాలి


పట్టభద్రుల ఓటర్ల జాబితా అందజేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : రాయలసీమ పశ్చిమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లె షాదీఖానాలో ఎమ్మెల్సీ ఎన్నికలపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్‌అమీర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, మండల ఉపాధ్యక్షులు నాయనపల్లె అనుదీప్, తుమ్మల భావన శ్రీధర్‌గౌడ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ మున్వర్‌బాషా, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు హాల్‌మస్తాన్, పెనుశిల నరసింహాస్వామి బోర్డు సభ్యుడు బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితాలు పంపిణీ

పట్టభద్రుల ఓటర్ల జాబితాలను మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి సంబంధిత ప్రాంతాల నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు వల్లూరు సుమన్, మార్కెట్ కమిటీ డైరెక్టరు మాధవీలతరెడ్డి, శ్రీవాణి, మైనార్టీ కన్వీనరు మన్సూర్‌ఖాన్, సల్మాన్ అల్తాఫ్, జిల్లా ఎస్టీ సెల్ నేత కాకిచంద్ర, పార్టీ నాయకులు గుండు జనార్ధన్, గోపాల్‌రెడ్డి, శేషయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : వైఎస్ఆర్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలని మండల ఉపాధ్యక్షుడు ఏజాస్‌ఆలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన వెన్నపూజ రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రమేష్, శ్యామ్, సర్పంచ్ లక్ష్మీపతి, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ అంజనప్ప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి


ఏఎన్ఎంలు, ఆశాలకు సూచనలు ఇస్తున్న స్టేట్ కన్సల్టెంట్ విజయకుమార్

రాయచోటి అర్బన్ : గర్భిణులలో రక్తహీనత ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ స్టేట్ కన్సల్టెంట్ విజయ కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన రాయచోటి అర్బన్ పరిధిలోని బోస్‌నగర్–4, గాలివీడు రోడ్డు సచివాలయం, రూరల్ పరిధిలోని ఎండపల్లె, మాధవరం–2 సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని గర్భవతులను సచివాలయాలకు పిలిపించుకుని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ, హెల్త్‌ఎడ్యుకేటర్ బలరామరాజు, సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం ఆపాలి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం కలిగించే ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటిలో కలెక్టర్ గిరీషా పీఎస్‌ను రైతు సంఘం, సీపీఐ నేతలు సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటకలో ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.5300 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలిచేందుకు ఇలా కుట్ర పన్నిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్, సీపీఐ రాయచోటి కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, నేతలు పుల్లయ్య, బత్తల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో గంగిరెడ్డి

నందలూరు(రాజంపేట): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈవో గంగిరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మార్సీలో మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనులు, యు–డైస్ వివరాలు, శానిటేషన్, మధ్యాహ్న భోజనం, ట్యాబ్‌ల వినియోగం, జగనన్న విద్యాకానుక, బైజూస్ కంటెంట్ వినియోగం తదితర విషయాలపై సమీక్షించామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ క్లాంపెక్స్ చైర్మన్ ఐజాక్ స్టాలిన్, శివరాంప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరిజాకుమారి, మాధవీలత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.